


బైపాస్!

మహబూబ్‌నగర్‌లో రూ. 550 కోట్లతో మూడో బైపాస్‌కు ప్రతిపాదనలు

- ప్రస్తుతం డీపీఆర్ తయారీకి పరిశీలన, ఆగస్టులో పూర్తి సర్వేకు టెండర్లు
- అటవీ భూములను మినహాయిస్తూనే అలైన్‌మెంట్ పూర్తిచేసే అవకాశం
- అలా అయితే అడ్డంకులు ఉండనట్లే.. 2028 కల్లా పూర్తిచేయాలని లక్ష్యం
- త్వరలోనే అందుబాటులోకి రానున్న చించోలి- భూత్పూరు బైపాస్ రోడ్డు
- తాజా 11 కిలోమీటర్ల అలైన్‌మెంట్ పూర్తయితే రింగ్‌రోడ్డు పూర్తి
- జడ్చర్ల- కోదాడ ఇక నాలుగు లేన్లు



మహబూబ్‌నగర్ కార్పొరేషన్

పాలమూరుకు మరో మణిహారం సాకారం కాబోతోంది. స్వరాష్ట్రంలో పాలమూరు వేగంగా అభివృద్ధి చెందుతోంది. అభివృద్ధితోపాటే ట్రాఫిక్ సమస్య తీవ్రమౌతోంది. దీంతో హైదరాబాద్-రాయచూరు ప్రధాన రహదారిని విస్తరించారు. అయినా వాహనాల రద్దీ పెరిగింది. ట్రాఫిక్ స్తంభించడం సాధారణంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి భూత్పూర్ రోడ్డు వరకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో కొంత ఊరట లభించింది. దీంతో పాటు త్వరలోనే చించోలి- భూత్పూరు బైపాస్ రోడ్డు అందుబాటులోకి రానున్నది. ఇక అప్పన్నపల్లి - చిన్నదర్పల్లి మూడో బైపాస్ రోడ్డు కూడా చేపడితే పాలమూరు నగరానికి కంఠాభరణంగా రింగ్‌రోడ్డు ఏర్పడనుంది. ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరి కార్పొరేషన్ స్థాయిలో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

మహబూబ్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కార్పొరేషన్ సిగలో మరో మణిహారం చేరనుంది. మునిసిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్ ఇటీవల కార్పొరేషన్‌గా మారిన విషయం తెలిసిందే. జనాభా పెరుగుతున్న కొద్ది నగరంలో ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రమవుతోంది. కొత్త కొత్త విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు వృద్ధి చెందుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు పెరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ భౌగోళికంగా ఒకట్రే హైదరాబాద్- రాయిచూర్ రోడు కలిగి ఉండేది. అందరూ పట్టణం గుండానే వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. గతంలో ఈ సమస్య తీవ్రంగా ఉండగా స్వ రాష్ట్రం ఏర్పడి న తర్వాత అప్పటి ప్రభుత్వం హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి భూత్పూరు రోడ్డు వరకు బైపాస్‌ను నిర్మించింది. అలాగే చించోలి- భూత్పూరు జాతీయ రహదారిలో భాగంగా మరో బైపాస్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ రోడ్డు పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ రెండు బైపాస్‌లు పూర్తయితే అర్ధచంద్రాకారం రోడ్డు అందుబాటులోకి వస్తుంది. అయితే దీన్ని పూర్తి రింగ్ రోడ్డుగా



మారిస్తేనే భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో మరో అర్ధచంద్రాకారం బైపాస్ కోసం ప్రతిపాదనలు పెట్టారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ ఇద్దరూ కలిసి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఈ రోడ్డుకు సంబంధించి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదనల జాబితాలో పెట్టగా ఆగస్టులో సర్వేకు టెండర్లు పిలువనున్నారు. ఆ లోపు డీపీఆర్ పూర్తిచేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. డీపీఆర్ పూర్తయ్యి

(మిగతా 6లో..)



ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్డు

రద్దీగా శ్రీశైలం ఘాట్ రోడ్డు



బ్రహ్మగిరి దారిలో రద్దీగా వాహనాలు

- రెండు రోజుల సెలవులు
- అధిక సంఖ్యలో రానున్న భక్తులు, పర్యాటకులు

బ్రహ్మగిరి/గద్వాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం డ్యాం గేట్లు రెండోసారి ఎత్తేందుకు డ్యాం అధికారులు కసరత్తు చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో ఉన్న జూరాల ప్రాజెక్టు, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి లక్షా యాభై వేల క్యూసెక్కులకు పైగా భారీగా వరద నీరు వస్తుండటంతో రెండు రోజుల్లోగా గేట్లు ఎత్తనున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 882 అడుగులకు పైగా చేరడంతో నిండుకుండలా తలపిస్తున్నది. ఆదివారం ప్రభుత్వ సెలవు దినం, బోనాల సందర్భంగా సోమవారం సెలవు దినాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డు మరోసాగి రద్దీగా మారనుంది. శనివారమే శ్రీశైలాని వాహనాలు బారులుకట్టాయి. గత వారం దోమలపెంట నుంచి శ్రీశైలం చేరుకునేందుకు 25కిలోమీటర్ల దూరాన్ని చేరుకునేందుకు ఆరు గంటలకుపైగా సమయం పట్టింది.

జూరాలకు 1.14లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జూరాలకు 1.14లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో ఉండగా 23గేట్లు ఎత్తి 89,378 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,505 క్యూసెక్కులు శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసులకు 37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 34,488 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉంది. కృష్ణా ప్రాజెక్టులకు మరికొన్ని రోజులు వరద కొనసాగే అవకాశం ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

బీజేపీ జెండా ఎగరాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ రెడ్డి

వనపర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ప్రధానంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానంలో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని సూచించారు. అప్పుడే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలిచే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతీ ఒక్కరిని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని పార్టీలో పదవులు ఉన్నా లేకున్నా పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. సర్పంచ్ నుంచి ఎంపీ ఎన్నికలు ఏవీ వచ్చినా వదలొద్దు అన్నారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడారు. నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీశైలం, లోకనాథ్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రామన్ గౌడ్, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి
ఒకరి మృతి
- భార్యను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఘటన
7

గంటలో డబ్బు రికవరీ
- బాధితునికి అప్పగించిన పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్
7

సమస్యలు ఉంటే నాకు చెప్పండి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- బీసీ బాలికల కళాశాల వసతి గృహం తనిఖీ
6

నేతన్నోత్తేజం

- నేత కార్మికులకు మరో కొత్త పథకం
- నేతన్న భరోసా పథకానికి సన్నాహాలు
- జియో ట్యాగ్ కలిగి ఉండి నేత పనిలో ఉన్న వారికి లబ్ధి
- ఉమ్మడి జిల్లాలో 11 వేల మంది కార్మికులు



చేనేత పనిలో నిమగ్నమైన కార్మికులు

అమరచింత, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు లబ్ధి చేకూరేలా మరో కొత్త పథకం రానుందా అంటే అవుననే చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కొత్త పథకాలకు శ్రీకారం చుడుతూ వస్తున్నది. త్రిఫ్ట్ ఫండ్, చేనేత బీమా, చేనేత ఆసరా తదితర పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా నేతన్న భరోసా పథకానికి శ్రీకారం చుట్టి మరో అడుగు ముందుకేసింది. దీంతో నేత కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని చెప్పవచ్చు.

● నేతన్న భరోసాతో లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతిష్ఠాత్మకంగా నేతన్న భరోసా పథకానికి శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. ఈ పథకం మార్గదర్శకాలను చేనేత జౌళిశాఖ వారు జారీ చేశారు. కార్మికులకు జియోట్యాగ్ కలిగి ఉండి త్రిఫ్ట్ ఫండ్‌లో చేరిన వా రికి ప్రభుత్వం నేతన్న భరోసా పథకానికి అర్హులుగా గుర్తించనుంది. ఈ పథకం కింద చేనేత కార్మికునికి సంవత్సరానికి 18వేలు, సహాయకునికి 6వేల నేతన్న భరోసా పథకం ద్వారా నేరుగా అకౌంట్‌లలో జమ చేయనుంది.

● ఉమ్మడి జిల్లాలో పదివేల మందికి పైనే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేతన్న భరోసా పథకానికి ఉమ్మడి మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోనున్నారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 11వేల మంది చేనేత కార్మికులకు 3500 జియో ట్యాగ్‌లు ఉన్నట్లు సమాచారం. 18 సంవత్సరాలపైబడిన నేత కార్మికులు జియో ట్యాగ్ నెంబర్ కలిగి ఉండి ప్రతీ నెలలో నాలుగు చీరలను చేయాల్సి ఉంటుంది. ప్రతీ చీరకు అధికారులు లేబుల్ ఇవ్వనున్నారు. ఆరు నెలల్లో 24 చీరలు నేసిన కార్మికులకే నేతన్న భరోసా పథకానికి అర్హులుగా గుర్తించనున్నారు. అర్హత కలిగిన కార్మికునికి రూ.18వేలు, సహాయకునికి 6వేలు సంవత్సరంలో రెండు దఫాలుగా ప్రభుత్వం ఇవ్వనుంది. ప్రభుత్వం ఈ పథకం సంబంధించి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో కార్మికులకు అవగాహన కల్పించడం ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రైతులకు మాదిరిగా ప్రభుత్వం ఈ పథకంతో చేనేత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు పేర్కొన్నారు.

● అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



నెలలో నాలుగు చీరలు నేస్తూ జియో ట్యాగ్ కలిగి త్రిఫ్ట్ ఫండ్ చేరి ఉన్న చేనేత కార్మికులు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన నేతన్న భరోసా పథకానికి అర్హులు. 18 సంవత్సరాలు పైబడిన అర్హులైన కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న కార్మికులను ఈ పథకం కింద గుర్తిస్తాం. ఈ పథకం కార్మికులకు ఎంతగానో భరోసానిస్తుంది.

\- పి. గోవిందయ్య, సహాయ సంచాలకుడు చేనేత జౌళీశాఖ

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కొడుకు కొట్టాడని తల్లిదండ్రుల ఫిర్యాదు
- మనస్తాపంతో గడ్డి మందు తాగి అఘాయిత్యం



ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్న పోలీసులు

వీపనగండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తమను కొడుతున్నాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శనివారం వీపనగండ్ల పోలీస్ స్టేషన్ ఎదుట చోటు చేసుకుంది. తెలుగు రాముడు వ్యవసాయం చేసుకుంటూ బొలెరో వాహనం నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. జూన్ నెలలో బొలెరో బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందడంతో ఇతనిపై కేసు నమోదు అయింది. ఈ వ్యవహారంలో రాముడు అప్పుల పాలయ్యాడు. అప్పు ఎలా తీర్చాలని మనోవేదనలో ఉన్నాడు. తల్లి బాలెల్లి బాలమ్మ పేరున ఉన్న ఇంటిని తనకు రాసిస్తే కుదువపెట్టి తనకున్న అప్పు తీర్చుకుంటానని తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చాడు. వారు ససేమిరా అనడంతో తల్లిదండ్రులపై చేయి చేసుకున్నాడు. దీనితో శనివారం కుమారుడిపై తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాముడిని పిలిపించి పోలీసులు విచారించారు. దీంతో ఇప్పటికే ఒక కేసు నమోదై ఉండడం, మళ్లీ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో అన్నం తినోస్తానని భార్యాపిల్లలతో ఇంటికి వెళ్లి తన వెంట తెచ్చుకున్న గడ్డి మందు తాగి పోలీస్ స్టేషన్ ఆవరణలోనే కుమారుడికి కూడా తాపి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యాపిల్లలు అరవడంతో బయటకు వచ్చిన పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. తండ్రి, కుమారుడు కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తకోట సీఐ, పెబ్బేరు, శ్రీరంగాపూర్ ఎస్‌ఐలు సంఘటన సంబంధించిన విషయాలపై ఎస్‌ఐ రాణిని అడిగి తెలుసుకున్నారు.

సీఎం సభతో ఒరిగిందేమీ లేదు
7
- కొల్లాపూర్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వని సీఎం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ఎద్దేవ

పెన్షన్ ఇవ్వడానికి చేతకాకుంటే

రాజీనామా చేసి ఇంట్లో కూర్చో

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

వనపర్తి టౌన్/గద్వాల టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచి ఇవ్వడానికి చేత కాకుంటే ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్‌లో వీహెచ్‌పీఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రైతులకు రుణమాఫీ పేరుతో రూ. 20 వేల కోట్లు ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దివ్యాంగులు ఎందుకు గుర్తుకు రావడం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా దివ్యాంగులకు పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడం మాని రైతు రుణమాఫీ ఇంకా పూర్తి చేయలేదని అడగటం దేనికి సంకేతమన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి మాట ప్రకారం ఆగస్టు నెల నుంచైనా దివ్యాంగులకు రూ. 6 వేలు, చేయూత పెన్షన్ రూ. 4 వేలు, కండరాల క్షీణిత గల వారికి రూ. 1500 పెన్షన్ పెంచుతవా? లేదా? అని ప్రశ్నించారు. అంతేకాకుండా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ వెంటనే మంజూరు చేయా లని, స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. రేవంత్‌రెడ్డితో తా డోపేడో తేల్చుకోవడానికే ఆగస్టు 13న హైదరాబాద్‌లో బహిరంగ సభ జరగబో తుందన్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన అన్నిరకాల పెన్షన్‌దారుల జిల్లాస్థాయి సదస్సులో మందకృష్ణ మాదిగ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయి ఆందోళన సదస్సుకు జిల్లాలోని పెన్షన్‌దారులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బుర్రి సతీష్, డీకే నర్సింహులు, శంకర్, కొంకల భీమన్న, మస్తాన్, మద్దిలేటి, రాజు, అశోక్, కన్న, మోషన్న, డేవిడ్, పరశురామ్, ఏసన్నతో పాటు డప్పు కళా మండలికి చెందిన చరణ్, రంగస్వామి, జీవన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గట్టు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం గట్టు మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... గట్టు మండల అభివృద్ధి కోసం 780 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు ప్రత్యేక పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. గోనుపాడు, అలంపూర్‌లలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అలాగే పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గట్టు మండలానికి 1700రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ. 7.25 కోట్ల బ్యాంకు రుణాల చెక్కు, రూ. 47.96 లక్షల వడ్డీలేని రుణాల చెక్కు, లబ్ధిదారులకు కొత్తరేషన్‌కార్డులను కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సెర్ప్ డైరెక్టర్ జమున, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఐఐటీ

- ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేందుకు మద్రాస్ ఐఐటీ నోటిఫికేషన్
- విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు ఈనెల 25 వరకు గడువు



ఐయిజలోని ప్రభుత్వ బాలుర పాఠశాల

6

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్
★ 24 గం॥లు, 12 గం॥లు వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్నపిల్లలను చూసుకోవడానికి & వంటపనికి, మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని ఫ్రీగ్గా లను పంపించగలము. సం॥ప్ర॥ 8977263124 & 9100116067
AJW-6637

WANTED
★ అనురాగ్ మానవ సేవాసంస్థ, వృద్ధుల ఆశ్రమం, టోలిచౌకి, హైదరాబాద్ - 500008, Ph: 9391008292, లో చేరుటకు వృద్ధులు & పని చేయుటకు నర్సులు, ఆయాలు, స్త్రీలు కావలెను.
AJH-068

ప్రతి 4లైన్లకు 200/- రూ॥
3+1 Scheme
ప్రతి అదనపు లైను 45/- రూ॥
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి
ఆఫీస్ : తిరుమలహిల్స్, మయూరి నర్సరీ, గ్రా. అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

బీచుపల్లి గురుకులంలో జడ్జి తనిఖీ

» మౌలిక వసతులు, గదుల పరిశీలన

» గత ఏడాది విద్యార్థుల పాదయాత్రపై ఆరా



బీచుపల్లి గురుకులంలో పరిశీలిస్తున్న అలంపూర్ కోర్టు న్యాయాధికారి మిథున్ తేజ్

ఎర్రవల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీచుపల్లి బాలుర గురుకుల పాఠశాలను అలంపూర్ కోర్టు న్యాయాధికారి మిథున్‌తేజ్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలను, వసతిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని, మరుగుదొడ్లు తక్కువగా ఉన్నాయని వారు తెలిపారు. వంటగదిలో పాడైన కూరగాయలు ఉండటాన్ని ఆయన గమనించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సూచించారు.గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఆందోళనకు దిగి, కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేయడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

వైద్యుల భర్తీకి దరఖాస్తులు

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఒక్కో పోస్టుకు ఒప్పంద ప్రాతిపదికన సంవత్సర కాలానికి భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుకు అనస్థీయ, జనరల్ సర్జన్, ఫారెన్సిక్ మెడిసిన్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వీరికి రూ.లక్ష వేతనం, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుకు ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వీరికి వేతన రూ.52,351 చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. 01-07-2005 నాటికి అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాల కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు (సైన్యంలో చేసిన సేవ కాలానికి అదనంగా) 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయో పరిమితి సడలింపు ఉంటుందని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారం స్వయంగా రిజిస్టర్ పోస్టు ద్వారా సూపరింటెండెంట్, జిల్లా హెడ్‌క్వార్టర్, ఏరియా ఆసుపత్రి జడ్చర్లకు ఈనెల 28 లోపు పంపాలని తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల కోసం

దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శర్వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ, డెయిరీ సైన్స్ సబ్జెక్టులు బోధించడానికి పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ నెల 22 సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో తమ దరఖాస్తులను అందించాలని ఆమె కోరారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం..

బిజినేపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలోని ఎస్వీ ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అవసరమైన అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు శనివారం తెలిపారు. తెలుగు, పొలిటికల్ సైన్స్, కామర్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో పాటు బోధన అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎన్ ఉదయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అందులో ఇంగ్లిష్ విభాగానికి 2, తెలుగు 1, పొలిటికల్ సైన్స్1, హిస్టరీ1, మ్యాథమెటిక్స్1, కంప్యూటర్ సైన్స్ /అప్లికేషన్ విభాగాలకు 1, కామర్స్ విభాగానికి 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీహెచ్‌డీ లేదా ఎన్‌ఈటీ /సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను 23-17-2025 సాయంత్రం 4:30 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొల్లాపూర్ ప్రిన్సిపాల్ ఎఫ్ఏసి కార్యాలయానికి సమర్పించాలని అన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా మెహిందీ



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మెహిందీ వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మెహిందీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ఆవరణలో రంగు రంగుల పూలతో ముగ్గులు వేసి చేతులకు గోరింటాకు పెట్టుకొని సంబురాలు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కళాశాల ఏవో మహ్మద్ ఇర్ఫాన్, సీనియర్ అధ్యాపకులు కోదండరాములు పాల్గొన్నారు.

పాసుబుక్కు తీసుకొని పట్టా చేసుకున్నాడు

» పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

నవాబ్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తన భర్త పేరుమీద ఉన్న భూమిని తనకు పట్టా చేయాలని కోరిన పాపానికి ఓ వీఆర్‌ఏ తన పేర పట్టా చేసుకుని, అనంతరం కూతురు పేర పట్టా చేసుకున్నాడని ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించిన సంఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన దివిటిపల్లి రాములమ్మ తన భర్త రాజయ్య 13 సంవత్సరాల క్రితం చనిపోయాడు. దీంతో గ్రామశివారులోని సర్వే నెంబర్ 152లో ఉన్న ఎకరం పొలాన్ని తన పేర మార్చాలని అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి వీఆర్‌ఏ పాలమూరి రామయ్యను కోరింది. పట్టా చేయిస్తానని పాసు బుక్కులు తీసుకుని తనకు విక్రయించినట్లు రిజిస్టర్ చేసుకున్నాడు. ఇది తెలయని ఆమె తనకు ఇంకా పట్టా అమలు కావడం లేదంటూ ఇంటి చుట్టూ తిరగడంతో ఆయన కూతురు సరోజ పేరుమీద పట్టా మార్చాడు. ఇదేమని అడగడంతో దాడికి యత్నించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ఐఐటీ

» ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేందుకు మద్రాస్ ఐఐటీ నోటిఫికేషన్

» విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు ఈనెల 25 వరకు గడువు

» ఏడాదిలో మూడు బ్యాచ్‌లకు శిక్షణకు ప్రణాళిక



వడ్డేపల్లి మండలం, రామాపురం జడ్పీహెచ్‌లో 10వ, తరగతి విద్యార్థులు

అయిజ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ శిక్షణపై ఆసక్తి ఉండి, ఆర్థిక పరిస్థితి సహకరించని పేద విద్యార్థులకు మద్రాస్ ఐఐటీ విద్యాలయం ఈఏడాది వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలో మూడు బ్యాచ్‌లకు ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేసుకునేందుకు ఈనెల 25వ తేదీని చివరి తేదీగా నిర్ణయించింది. ఆగస్టు మొదటివారంలో తరగతులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. "స్కూల్ కనెక్ట్ " పేరుతో ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో 10కోర్సులకు శిక్షణ ఇచ్చేందుకు మద్రాస్ విద్యాలయం ఏర్పాట్లు చేసింది.

కోర్సులు ఇవే..

డాటాసైన్స్, ఏఐ, ఎలక్ట్రానిక్ సిస్టమ్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఫన్‌విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, మ్యాథ్స్ అన్‌ప్లగ్‌డ్ గేమ్స్ అండ్ పజిల్స్, పర్యావరణం, ఇంజనీరింగ్ బయోలాజికల్ సిస్టమ్, లా, ఏరోస్పేస్ (ప్రాథమికాంశాలు), హ్యూమానిటీస్, తదితర కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు.

గద్వాల జిల్లాలో ఇలా..

జోగులంబ గద్వాల జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 124 పాఠశాలల్లో పదవ తరగతి విద్యాబోధన కొనసాగుతున్నది. 2024-25 విద్యాసంవత్సరంలో 7,569 మంది విద్యార్థులు టెన్త్ పూర్తి చేశారు.

ఈ ఏడాది మరో వందమంది వరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఐఐటీ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

చాలా మంచి అవకాశం



మాలాంటి పేద కుటుంబాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఐఐటీ శిక్షణ ఇవ్వటం చాలామంచి అవకాశం. నేను కూడా నేర్చుకోవాలనుకుంటున్నాను. బయట రూ.వేలల్లో ఫీజులు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేము. ఇది మాకు చక్కటి అవకాశం. ఈ కోర్సులపై శిక్షణ అందితే భవిష్యత్తులో ఇంకా ఎదిగే అవకాశాలు ఉంటాయి.

- గంగోత్రి,
10వ తరగతి విద్యార్థిని, జిల్లెడుదిన్నె గ్రామం, వడ్డేపల్లి

ఐఐటీకి మార్గం సుగమం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐఐటీలో మద్రాస్ విద్యాలయం ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వటం వల్ల భవిష్యత్తులో ఐఐటీలో సీటు సంపాదించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ విషయంపై మేము విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. బయట దాదాపు మూడేళ్ల కోచింగ్ తీసుకోవటంతో ఇంటర్ తర్వాత విద్యార్థులు ఐఐటీ సీట్లు సాధించే అవకాశం ఏర్పడుతుంది.

- ఎల్లస్వామి,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మార్లబీడు, ధరూరు

విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ఐఐటీలో పదవ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇస్తున్న విషయంపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాము. ప్రతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించి, వారి సమ్మతితో ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేయాలని సూచించాము. ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- అబ్దుల్ ఘనీ, డీఈవో, గద్వాల

సమస్యలు ఉంటే నాకు చెప్పండి

» కలెక్టర్ బదావత్ సంతోష్

» బీసీ బాలికల కళాశాల వసతి గృహం తనిఖీ



బాలికల కళాశాల వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని శనివారం సాయంత్రం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం నాణ్యతను పరిశీలించారు. మీ హాస్టల్‌లో ఎలాంటి అసౌకర్యాలు, సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. వసతి గృహంలోని పలు సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో 60మంది విద్యార్థినులు, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులతో వసతులపై ఆరా తీశారు. విద్యార్థినులు చెప్పిన సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ త్వరగా వాటికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. విద్యార్థినులు ఉన్నతంగా చదువుకుని ఉన్నత స్థితిలోకి రావాలని కలెక్టర్ సూచించారు.

బీసీలను మోసం చేస్తే మరో ఉద్యమం

» రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్డినెన్స్ పేరుతో బీసీలను మోసం చేయాలని చూస్తే మరో తెలంగాణ ఉద్యమం నిర్వహిస్తామని రిటైర్డ్ డీఈవో విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాములు యాదవ్ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజక వర్గస్థాయి రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరాలన్నారు. వీటిని ఏ పార్టీ, సంస్థలు వ్యతిరేకించిన వారి కార్యాలయాలు, ఇళ్ల వద్ద ఆందోళనలు, చావు డప్పు మోగిస్తామన్నారు, రిజర్వేషనులు అమలు చేస్తున్న తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తేవాలన్నారు. ఇప్పటికే విద్యా ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని ఖండించారు.

సమావేశంలో వేణుగోపాల్, రాజేష్‌గౌడ్, భాస్కర్, వెంకటన్న గౌడ్, యాదగిరి యాదవ్, తిరుపతయ్య, సురేష్‌గౌడ్, గంగాధర్, రాజేందర్, కిషన్ నాయక్, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన జాతీయ బృందం



నర్సరీని పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో జాతీయ స్థాయి మానిటరింగ్ టీం సభ్యులు మూడు రోజుల పాటు పర్యటించారు. మండల పరిధిలోని బెక్కెర, ముకురాల, వేపూర్ గ్రామాల్లో జాతీయ స్థాయి మానిటరింట్ టీం సభ్యులు బాలమురళి, రాధికలు తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ రికార్డులను, ఈజీఎస్ పనుల తీరును స్వయం సహాయక సంఘాల పనితీరును, పంచాయతీరాజ్‌లో నిర్మించిన సీసీ రోడ్లను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. వారి వెంట కల్వకుర్తి ఎంపీడీవో ఎన్.వెంకట్రాములు, ఏపీవో రాజు, ఏపీఎం సైదులు, కార్యదర్శులు ఉన్నారు.

భూవివాదంపై కేసు నమోదు

గండీడ్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : భూవివాదంపూ కేసు నమోదైన సంఘటన మండలంలోని సల్కర్‌పేట గ్రామంలో వనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని పాత భూ వివాదాలు మనస్సులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన బంధువులైన ఇద్దరు వ్యక్తులు శనివారం మధ్యాహ్నం కట్టెతో దాడి చేశారు. ఈ ఘటనపై లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు

మూసాపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం శాఖాపూర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని శనివారం కారు ఢీకొట్టింది. అడ్డాకుల ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. గుడిబండకు చెందిన వాకిటి శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ నుంచి అడ్డాకులకు వస్తుండగా శాఖాపూర్ వద్ద వెనక నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసులుకు గాయాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రై'పాస్'!

(5వ పేజీ తరువాయి)

సర్వే రిపోర్టు కూడా కేంద్రానికి అందిన తర్వాత నిధులు మంజూరై 2028 పూర్తయ్యేనాటికి ఈ బైపాస్ రోడ్డు పనులు పూర్తిచేసే విధంగా కసరత్తు చేస్తున్నారు. కేంద్రం తాజాగా రాష్ట్రంలో అభివృద్ధి చేయదలచిన నాలుగు వరసుల రోడ్ల జాబితాలో మహబూబ్‌నగర్ బైపాస్ కూడా ఉండటంతో పాలమూరు వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అటవీ ప్రాంతం లేకుండానే

ఇన్నాళ్లు మరో అర్ధచంద్రాకారం బైపాస్ పూర్తిచేయాలంటే అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది, అటుపక్క మొత్తం అటవీ భూములే ఉన్నాయనే ఆందోళన వ్యక్తమైంది. అయితే తాజాగా కేంద్రం వద్దకు తీసుకుపోయిన ప్రతిపాదనల ప్రకారం అటవీ ప్రాంతాన్ని మినహాయిస్తూనే బైపాస్ పూర్తిచేయనున్నారు. మొత్తం 11 కిలోమీటర్ల దూరంలో ఎక్కడా అటవీ ప్రాంతం తగలకుండా అలైన్‌మెంట్ ఉంటుందని సమాచారం. అప్పన్నపల్లి, మౌలాలిగుట్ట, పిల్లలమర్రి, ఎర్రసత్యం కాలనీ, బోయపల్లి- టంకర శివారు నుంచి చిన్నదర్పల్లికి కలుస్తుందనేది ప్రాథమిక అంచనాల ద్వారా తెలుస్తుంది. అయితే ఈ ప్రాంతాల్లో భూసేకరణ, షిఫ్టింగ్, మరో స్థలం చూపించడం వంటి అంశాలు కొంత సవాల్‌గా మారే అవకాశం ఉంది. గతంలో కూడా బైపాస్ నిర్మించినప్పుడు అనేక భూవివాదాలు నెలకొన్నాయి. అయితే ఎట్టి పరిస్థితుల్లో 2028 వరకు ఈ బైపాస్ రోడ్డు పూర్తయ్యే అవకాశం కచ్చితంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఈ బైపాస్ రోడ్డు మొత్తం 11 కిలోమీటర్లు కాగా రూ. 550 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత పూర్తిస్థాయి అంచనాలను కేంద్రం ముందు ఉంచి ఆమోదం చేసుకునే అవకాశం ఉంది. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతుల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాలని కేంద్రం నిబంధన పెట్టడంతో దాదాపు అటవీ ప్రాంతం తగలకుండానే ఈ రోడ్డు అలైన్‌మెంట్‌ను సిద్ధం చేసే అవకాశం ఉంది.

జడ్చర్ల- కోదాడ ఇక నాలుగు లేన్లు

జాతీయ రహదారి-167లో జడ్చర్ల నుంచి కోదాడ వరకు ప్రస్తుతం ఉన్న డబుల్ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా మార్చడానికి కూడా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేయాలని సూచించింది. జడ్చర్ల- కల్వకుర్తి, దేవరకొండ, మల్లేపల్లి, హాలియా, అలీనగర్, మిర్యాలగూడ మీదుగా ఈ రోడ్డు కోదాడకు వెళ్తుంది. మొత్తం 219 కిలోమీటర్ల ఈ మార్గంలో నాలుగు వరుసల రోడ్డు మంజూరు కానుంది. మహబూబ్‌నగర్‌తోపాటు కర్ణాటకలోని కొన్ని జిల్లాల నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌వైపు వెళ్లడానికి ఈ రోడ్డు ప్రధాన మార్గంగా ఉన్నది. అయితే పెరుగుతున్న వాహనాల రద్దీ దూరభారం తగ్గుతుండటంతో తాజా ప్రణాళికలో ఈ రోడ్డుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 15 రోడ్లను నాలుగు వరుసలుగా మార్చడానికి కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపిన నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోనే రెండు రోడ్లు ఇందులో భాగంగా అభివృద్ధి కానున్నాయి. ఇక మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కూడా కేంద్రం ఆలోచనలు చేస్తున్నది. దీనివల్ల అటవీప్రాంతంలో జంతుజాలానికి ఇబ్బందులు లేకుండా ఉండటంతో పాటు నిరంతరం వాహనాల రాకపోకలు కొనసాగేందుకు వీలు ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయి

సైక్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



మమత



త్రివేణి

చిన్నచింతకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పెద్ద వడ్డెమాన్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో ఈనెల 13న మక్తల్‌లో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ రోడ్డు స్పీడ్ సబ్ జూనియర్ సైక్లింగ్ 5 కిమీ విభాగంలో దమగ్నాపూర్‌కు చెందిన మమత 4వ స్థానం, నర్వ మండలం కుమార్‌లింగంపల్లికి చెందిన త్రివేణి 5వ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం నరేందర్, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ప్రసన్న శనివారం తెలిపారు. వీరు ఈనెల 20న హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

క్యాతూరు లిఫ్ట్‌లో గందరగోళం



క్యాతూరు లిఫ్ట్

అలంపూరుచౌరస్తా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అలంపూరు మండలం, క్యాతూరు లిఫ్ట్‌లో గందరగోళం నెలకొంది. గత ఏడాది క్రితం పలుచోట్ల పైపులు పగిలిపోతే అనధికారికంగా గద్దెనెక్కిన కమిటీవారు చెతులెత్తేశారు. దీంతో ఏడాదికాలంగా మరమ్మతులకు నోచుకోక పోగా పట్టించుకునేవారు లేకపోవడంతో లిఫ్ట్ వద్ద ఉన్న పలు యంత్రసామాగ్రి, కాపర్ వైర్లు, బ్యాటరీలు, స్టార్టర్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. కనీసం ఈ ఏడాదైన సాగునీటిని వాడుకోవాలన్న ఉద్దేశంతో గ్రామంలో రైతులంతా కలిసి ఐదారుగురు పెద్దమనుషులతో సమావేశమయ్యారు. గద్దెనెక్కిన కమిటీ పట్టించుకోవడంలేదని, ఎలాగైనా వచ్చే రబీ సీజన్‌కు నీటిని వాడుకునేలా మరమ్మతులు చేయించాలని కోరారు. దీంతో పెద్దరైతులు తలా ఇంత వేసుకుని సుమారు రూ.14లక్షలు పెట్టి మరమ్మతులు చేయించారు. రైతులే స్వయంగా లిఫ్టను స్వాధీన పరుచుకునే క్రమంలో కమిటీ అధ్యక్షుడు శుక్రవారం లిఫ్ట్ వద్దకు వెళ్లి రైతులకు సమాచారం లేకుండా తాళం వేసుకోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో రైతులంతా కలిసి రైతుల సౌకర్యార్థం మరమ్మతులు చేయించుకుంటే తాళాలు వేసుకోవడమేంటని కమిటీ అధ్యక్షుడిని అదే రోజు సాయంత్రం నిలదీశారు. శనివారం గ్రామ రైతులు లిఫ్ట్ వద్దకు వెళ్లి తాళాలు పగులగొట్టి ఆధీనంలోకి తీసుకున్నారు. ఈవిషయంపై కమిటీ అధ్యక్షుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

కొనసాగుతున్న మాసుం బాబా ఉర్సు

పెంట్లవెల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జటప్రోలు గ్రామంలో కుల మతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అచ్చంపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల తదిరత ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి బాబా సమాధిని దర్శించుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీపి వంటకాలతో పాటు పొట్టేళ్లు, మేకలను బలిచ్చి కందూరు చేశారు. ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా దర్గా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ సమీపంలో విద్యార్థులు, ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. జడ్చర్ల మండలంలోని కోడ్గల్, లింగంపేట గ్రామాలకు చెందిన విద్యార్థులతో పాటు మరికొందరు ప్రయాణికులతో శనివారం సాయంత్రం జడ్చర్ల నుంచి కోడ్గల్‌కు వెళ్తున్న ఆటో గంగాపురం సమీపంలో బోల్తా పడింది. ఈ సంఘటనలో విద్యార్థులు ముడావత్‌మధు, మిద్దెప్రకాశ్, ప్రవల్లికతో పాటు రాములు, కృష్ణయ్యకు గాయాలయ్యాయి. వీరిని స్థానికుల జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్, ముడావత్ మధును జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స కోసం ముడావత్ మధును హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, ఇంతియాజ్‌ఖాన్, నవీన్‌రెడ్డి, శంకర్‌నాయక్ పరామర్శించారు. మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ఆటోలో దాదాపు 18 మంది విద్యార్థులు, ప్రయాణికులు ఉన్నట్లుగా స్థానికులు తెలిపారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం..
వ్యక్తిపై కేసు నమోదు

మాగనూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు మండలం ఉజ్జల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన చాకలి భీమేష్ కర్ణాటక మద్యం అమ్ముతున్నాడనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ సీఐ బి.అనంతయ్య ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు అతని ఇంట్లో తనిఖీలు చేశారు. తనిఖీలో 15 ఒరిజినల్ ఛాయిస్ కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభ్యమయ్యాయి. చాకలి భీమేష్‌ను అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, కృష్ణవేణి, నరేష్, గౌసియా తదితరులున్నారు.

కారు అదుపు తప్పి ఒకరి మృతి

» భార్యను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఘటన

కొత్తకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : భార్యను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా నందికొట్కూర్ పట్టణానికి చెందిన ఓంకార్ నాగిరెడ్డి, భార్య శ్రీలక్ష్మీరెడ్డిని హైదారాబాద్‌లోని ఆసుపత్రికి బంధువులు ప్రభాకర్‌రెడ్డి, ప్రమీలమ్మలతో కలిసి సొంత కారులో బయలుదేరారు. కొత్తకోట మండల ముమ్మళపల్లి సమీపంలోని కడుకుంట్ల స్టేజి వద్ద డివైడర్‌ను కారు అదుపు తప్పి ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న ఓంకార్ నాగిరెడ్డి (36) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా మిగతా ముగ్గురికి స్వల్పంగా గాయలయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలెపల్లి శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బుర్హాపూర్ జిల్లా బంబాడ గ్రామానికి చెందిన శుభమ్‌ఆగె (30) జూన్ 7వ నుంచి పోలెపల్లి సెజ్‌లోని శిల్ప మెడికేర్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తూ జడ్చర్ల లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడి బైకును తీసుకుని పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమకు వెళ్తుండగా పోలెపల్లి శివారులో ఎదురుగా వచ్చిన బైకు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో శుభమ్‌ఆగె తీవ్రంగా గాయపడగా, జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. శుభమ్‌ఆగె సోదరుడు సూరజ్‌ప్రకాశ్‌ఆగె ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసిన ట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామ సమీపంలోని హెచ్‌ఈఎస్ కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం, గ్రామ్‌మహరికలకు చెందిన రాజ్‌కుమార్ (47) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆకస్మాత్తుగా కిందపడ్డాడు. వెంటనే చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తీసుకు రాగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలంటూ వరసకు సోదరుడైన రాకేశ్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

నవాబ్‌పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని ఓ బాలుడు పురుగుల మందుతాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని జంగమయ్యపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విక్రమ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముష్టి సుధాకర్ పెద్ద కుమారుడు గౌతం(16) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా గ్రామంలో తిరిగేవాడు. ఈనెల 17న రాత్రి గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి కొట్టుమిట్టాడుతున్నాడని గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో డిగ్రీ చదువుతున్న ఇమ్మడి నిఖిత (18) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. ఇందిరానగర్ కాలనీకి చెందిన ఇమ్మడి రమేశ్, మాధవి దంపతుల కుమార్తె నిఖిత జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వారి తల్లిదండ్రులు సిగ్నల్‌గడ్డ వద్ద మిర్చిబండి వ్యాపారం నిర్వహించుకునేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాత్రి 7.30 గంటలకు ఇంటికి వెళ్లారు. కాగా అప్పటికే బెడ్‌రూంలో చీరతో గొంతుకు ఉరివేసుకుని వేలాడుతున్న కుమార్తె నిఖితను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన అంశంపై విచారణ చేపట్టాలంటూ శనివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

» ఐదుగురి నుంచి రూ6,600 స్వాధీనం

» పట్టుబడ్డ ఐదు సెల్‌ఫోన్లు

నారాయణపేట,మరికల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం అప్పంపల్లి గ్రామ శివారులో శనివారం టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ.6,600 నగదుతో పాటు, ఐదు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మరికల్ ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు.

కల్లు అక్రమ దుకాణం సీజ్

» శ్యాంపిల్స్ సేకరణ

మిడ్జిల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో అనుమతి లేకుండా పాపయ్యగౌడ్ నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. 19.5 లీటర్ల పైగా కల్లు దొరికిందని, కల్లును అక్కడే పారబోసి శ్యాంపిల్స్‌ను సేకరించి, ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. పాపయ్యగౌడ్‌పై కేసు నమోదు చేశామని, ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మురళి, సిబ్బంది సిద్ధు, చంద్రమౌళి ఉన్నారు.

గంటలో డబ్బు రికవరీ

» బాధితునికి అప్పగించిన పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి గంట వ్యవధిలో డబ్బులు రికవరీ చేసి అప్పగించిన సంఘటన జోగుళాంబ గద్వాలలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం మధ్యాహ్నం 12గంటలకు బీహార్‌కు చెందిన వినోద్‌ఖాని ఏటీఎం మిషన్ ద్వారా తన ఖాతాలోకి రూ.8వేలు జమ చేసేందుకు వచ్చాడు. మిషన్‌లో డబ్బులు వేశాడు. ఖాతాలో జమ అవుతాయనుకుని వెళ్లిపోయాడు. కానీ మిషన్‌లో అతని డబ్బులు తిరిగి బయటికి వచ్చినది గమనించకుండా వెళ్లిపోయాడు. ఎంతకూ ఖాతాలో జమ అయినట్లు మెసేజ్ రాకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీసీ కెమెరాల ఆధారంగా ఎస్ఐ పరిశీలించగా బీహార్‌కు చెందిన వ్యక్తి వెనుక ఉన్న ఓ వ్యక్తి ఏటీఎం మిషన్‌తో రిటర్న్‌అయిన డబ్బులు తీసుకొని వెళ్లిపోయాడు. సీసీఫుటేజీ ఆధారంగా అతని ఆచూకీ తెలుసుకుని రికవరీ చేశారు. గంటలో బాధితునికి డబ్బు అందజేశారు.

మాతా శిశు సంరక్షణ కార్డులేవి?

» ఏడాదిగా జిరాక్స్‌లతో కాలం వెల్లదీస్తున్న గర్భిణులు




జనరల్ ఆసుపత్రి గైనిక్ ఓపి విభాగంలో జిరాక్స్ కార్డులతో గర్భిణులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడాది కాలంగా మాతాశిశు సంరక్షణ కార్డుల (ఎంసీపీ- మథర్, చైల్డ్ ప్రొటెక్షన్) కొరత తీవ్రంగా వేధిస్తోంది. మాతా శిశు సంరక్షణ, మాతృ మరణాలను సమర్థవంతంగా నివారించడంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్డులను అమల్లోకి తెచ్చింది. అయితే ఏడాది కాలంగా ప్రభుత్వం ఈ కార్డులను సరఫరా చేయడం లేదు. దీంతో జిరాక్స్ కాపీలతోనే కాలం వెల్లదీస్తున్నారు.

కార్డుల్లో సమగ్ర సమాచారం..

ఎంసీబీ కార్డులను ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆశా కార్యకర్తలు గర్భిణులకు అందిస్తారు. అందులో పూర్తి వివరాలు, ఆరోగ్య సమస్యలు, ఇది వరకు ప్రసవం, గర్భస్థ శిశువు వివరాలు, బరువు, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయి. ఈ కార్డుల్లో పొందుపరిచిన వివరాల ప్రకారం వైద్యం తీసుకోవడంతో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. ఒక మహిళ గర్భందాల్చిన నెల నుంచి 9 నెలలకు ప్రసవం అయిన తర్వాత, పుట్టిన బిడ్డ, తల్లి ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అందించిన వైద్యసేవలను అందులో నమోదు చేస్తారు.



ఒకే కార్డుతో అన్ని జిరాక్స్‌లు

జిల్లాలో ఎంసీబీ కార్డుల కొరత తీవ్రంగా ఉంది. ఏడాది కాలంగా ప్రభుత్వం వాటిని సరఫరా చేయడం లేదు. దీంతో ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలలో ఒక్క కార్డుతో అందరికీ జిరాక్స్‌లు తెచ్చుకొమ్మని చెబుతున్నారు. అయితే ఒక్కో కార్డులో 20 పేజీలు ఉంటాయి. రెండు వైపుల కలిసి 40 పేజీలు అవుతుంది. ఒక్కో జిరాక్స్ కాపీ రూ. 2 చొప్పున 40 పేజీలకు రూ.80 ఖర్చు అవుతుంది. అంతే కాకుండా ఆ కార్డులు నాణ్యతగా ఉండడం లేదు. 2 నుంచి 3 నెలల్లో చిరిగిపోతున్నాయి. మళ్లీ జిరాక్స్ చేయించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. చిరిగిపోయిన కార్డుల్లో మళ్లీ వివరాలను నమోదు చేయాల్సి వస్తుందని ఏఎన్ఎంలు, ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 16,640 మంది గర్భిణీలు..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 16,640 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరందరిలో ఒక్కరికి కూడా ఎంసీబీ కార్డులు లేవు. అన్ని పీహెచ్‌సీలలో జిరాక్స్‌లు తీసుకొమ్మని చెబుతున్నారు. ప్రతీ నెల కొత్తగా గర్భిణులు నమోదు అవుతూనే ఉన్నారు.

జిరాక్స్‌లు తీసుకుంటున్నా..



మొదట గర్భిణీగా ఉన్నప్పుడు జిరాక్స్‌ల తోనే కాలం గడిపాను. రెండో సారి కూడా జిరాక్స్ కార్డులే ఇచ్చారు. డబ్బులు పెట్టి జిరాక్స్ చేయించు కుంటున్నాము. అవి కూడా ఎక్కువ రోజులు ఉండడం లేదు. అందులో నమోదు చేసిన వివరాలు కూడా కనిపించక ఇబ్బందులు అవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఎంసీబీ కార్డులు సరఫరా చేయాలి.

- పల్లవి, గర్భిణీ, తాటికొండ

ఎంసీబీ కార్డుల కొరత వాస్తవమే..

కార్డుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఈ ఏడాది ఫిబ్రవరిలో 8వేలు వచ్చాయి. వాటిని పీహెచ్‌సీలకు పంపించాం. అక్కడక్కడ ఉండకపోవచ్చు. ఆ కొరత కూడా లేకుండా చూస్తాం. ప్రతీ నెల 2వేల వరకు కార్డులు అవసరం అవుతున్నాయి. లేని చోట్ల జిరాక్స్‌లతో నడిపిస్తున్నాం.

- పద్మజ, జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

పాలమూరులో భారీ వర్షం

మహబూబ్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం కూడా మోస్తరు వర్షం కురిసింది.

- మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో 8 సెం.మీ. వర్షం కురిసింది. కోయిలకొండలో 3.8 సెం.మీ, మహబూబ్‌నగర్ నగరంలో 3.7 సెం.మీ, దేవరకద్రలో 3.1 సెం.మీ, నవాబ్‌పేటలో 2.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.
- నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలంలో 64.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.
- నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో 24.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా కొత్తపల్లి మండలంలో 10.3 మి.మీ., కోస్గి మండలంలో 4.8 మిమీ., దామరగిద్ద మండలంలో 4.5, ఊట్కూర్‌లో 3.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- జోగుళాంబ గద్వాల కేటీదొడ్డి మండలంలో 14.3 మిల్లీమీటర్లు, అయిజలో 6.7, గద్వాలలో 6.2, గట్టు, వడ్డేపల్లి లలో 5.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.
- వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలో 5.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని టీజీఎస్ ఆర్టీసీ డిపోల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విభాగాల్లో మూడేళ్ల పాటు అప్రెంటిస్‌షిప్ శిక్షణకు ఆసక్తి గల గ్రాడ్యుయేట్స్ ఈనెల 21 నుంచి 27వరకు దరఖాస్తు చేసుకో వాలని టీజీఎస్ ఆర్టీసీ ఆర్ఎం సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజి నీరింగ్, డిప్లొమా ఏదైన డిగ్రీ అర్హత కలిగిన 2020-21 నుంచి ఇప్పటి వరకు ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

» అదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

» మహిళల సహకారం లేనిదే అభివృద్ధి లేదు

» త్వరలోనే మిగతా మండలాల మహిళా సమాఖ్యలకు బస్సులు ఇస్తాం: కలెక్టర్ విజయేందిర బోయి

» జడ్చర్లలో ఇందిరమ్మ మహిళా శక్తి నియోజకవర్గ సంబురాలు



మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదగడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. అన్ని రంగాలలో మహిళలు ముందున్నారని, మహిళల సహకారం లేకుంటే అభివృద్ధి లేదని చెప్పారు. జడ్చర్ల పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన జడ్చర్ల నియోజకవర్గ ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాలలో ఎమ్మెల్యే, కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాలకు బస్సులను ఇచ్చామని, వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని చెప్పారు. జడ్చర్లకు బైపాస్ రోడ్డు ఎంతో అవసరమని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తికి నిధులు కేటాయించాలని, పాఠశాలలు మరమ్మతుకు నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరానని వెల్లడించారు. మహిళలను కించపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు చెడుగా రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్చర్ల మునిసిపాలిటీలో వర్షం పడితే డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రూ.15 కోట్లు మంజూరు అయ్యాయని, అదనంగా మరో రూ.10 కోట్లు అవసరమని, ఆ నిధులను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ ప్రభుత్వం జడ్చర్ల, నవాబ్‌పేట మండల మహిళా సమాఖ్యలకు బస్సులను ఇచ్చిందని, త్వరలోనే మిగతా మండలాలకు ఇస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని 2,970 మహిళా సంఘాలకు రూ.3,36,17,896 వడ్డీ లేని రుణాల చెక్కును సమాఖ్య అధ్యక్షులకు అందించారు. జడ్చర్ల, నవాబ్‌పేట మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీకి బస్సులను అద్దెకు ఇచ్చినందుకు వచ్చిన రూ.1,38,936 చెక్కును, లోన్ బీమా రూ.18.23 లక్షల చెక్కును, ప్రమాద బీమాకు సంబంధించిన రూ.30 లక్షల చెక్కులను ఇచ్చారు.

అనంతరం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం మహిళలకు 200 కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బాద్మి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 పట్టణంలో నిర్వహించే ఇందిర శక్తి సంబురాలకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్కను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ఈ నెల 21న పట్టణంలో నిర్వహించే ఇందిర మహిళా శక్తి సంబురాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రులు సీతక్కతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లురవితో పాటు ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. నియోజక వర్గంలోని మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

» కర్ణాటకకు తరలుతున్న యూరియా



మక్తల్‌లో ఆటోలో తరలుతున్న యూరియా బస్తాలు

మక్తల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో కొందరు వ్యాపారులు అనుమతి లేకుండా ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా దుకాణాల్లో యూరియా బస్తాలను నిల్వ చేస్తు తెలంగాణ సరిహద్దులోని కర్ణాటకకు తరలిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత పక్షం రోజులుగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తు అవి లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఎరువుల దుకాణదారులు అక్రమ నిల్వలతో పాటు లూజు విత్తనాలను కర్ణాటక, తెలంగాణ రైతులకు విక్రయిస్తున్నారు. మక్తల్‌లో బస్తా యూరియా రూ.370 లకు లభించగా, కర్ణాటకలో బస్తా యూరియా రూ.500ల పైచిలుకు ఉంది. అక్కడి ప్రభుత్వం సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకలో విక్రయిస్తున్నారు. సరిహద్దు గ్రామాల ద్వారా యూరియాను అక్కడికి తరలిస్తున్నారు. కర్ణాటకలో కొంత మంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా నాలుగైదు గ్రామాలకు ఓ ఏజెంటను ఏర్పాటు చేసి, ఇళ్లను అద్దెకు తీసుకొని యూరియాను నిల్వ చేస్తున్నారు. ఎరువుల దుకాణం పెట్టిన కొన్ని రోజులకే ఓ వ్యాపారి కోట్ల రూపాయలు సంపాదించడం గమనార్హం. గత ఏడాది సదరు వ్యాపారి నకిలీ విత్తనాలు అమ్మడంతో కాపు సరిగా రాలేదని సదరు వ్యాపారి దుకాణం ముందు ఆందోళన చేశారు. అప్పట్లో రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని రాజీ కుదిర్చారు. గతనెల కర్ణాటక రాష్ట్రం బద్దిపల్లి గ్రామానికి చెందిన రైతుకు యూరియాను విక్రయించినట్లు గుర్తించి వారంరోజుల పాటు లైసెన్సు రద్దు చేశారు. ఇదిలా ఉండగా గత వేసవిలో కొందరు వ్యాపారులు జడ్చర్ల వద్ద ఉన్న స్టాక్ పాయింట్‌లో యూరియా కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. డిమాండ్ ఉన్న సమయంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పట్టణంలోని కొందరు వ్యాపారులు ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసినా బిల్లులు ఇవ్వడం లేదని పలువురు వాపోతున్నారు. మక్తల్‌లో ఎరువుల కొరత ఏర్పడటంతో అదనపు కలెక్టర్ కొన్ని దుకాణాలను తనిఖీ చేశారు. ఇప్పటికైనా స్థానికంగా ఉండే అధికారులు యూరియా తరలింపుపై నిఘా ఉంచి అక్రమార్కుల ఆట కట్టించాలని, కావాల్సినంత యూరియాను అందుబాటులో ఉంచాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

సీఎం సభతో ఒరిగిందేమీ లేదు

» కొల్లాపూర్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వని ముఖ్యమంత్రి

» బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ఎద్దేవ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీఎం సభతో కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎల్లేని సుధాకర్‌రావు ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టేందుకే బహిరంగ సభ ఏర్పాటు చేసినట్టు ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం ఎల్లేని విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ విమర్శలు చేయడం కోసమే జటప్రోలు గ్రామానికి వచ్చినట్లు ఉందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కనీసం ఒక్క రూపాయి కూడా ముఖ్యమంత్రికి మంజూరు చేయలేదని తెలిపారు. ప్రజలను మోసగించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని ఆయన ధ్వజమెత్తారు. బహిరంగ సభకు కూతవేటు దూరంలో రాజకీయ హత్యకు గురికాబడ్డ బొడ్డు శ్రీధర్‌రెడ్డి నిందితులను శిక్షించి ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేయడానికి మీకు ఏ శక్తి అడ్డుగా నిలిచిందని ఎల్లేని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి జూపల్లికి ఓటు వేసి గెలిపించిన కొల్లాపూర్ ప్రజలను మభ్య పెట్టడం తగదన్నారు.

శనీశ్వర స్వామికి పూజలు



నంది వడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలో గల సార్ధ సప్త జేష్టాదేవి సమేత శనీశ్వరస్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జన్మ, గోచార రీత్యా గ్రహదోషాలు ఉన్న వారు ఏలినాటి శని, అర్ధాష్టమి శని, అష్టమ శని గ్రహ బాధలు తొలగేందుకు స్వామికి తిల తైలాభిషేకాలు, బ్రహ్మ సూత్రం ఉన్న పరమ శివుడికి రుద్రాభిషేకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, గవ్వమఠం ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సదా మీ సేవలో..

అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి
గద్వాల జిల్లా : 9985404383
మహబూబ్‌నగర్ జిల్లా: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా : 8374394441
నారాయణపేట జిల్లా : 9985456557
వనపర్తి జిల్లా : 9010937550
పత్రిక పంపిణీలో ఏమైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన మేనేజర్ : 9985411170

ఇంటర్వ్యూ..

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

- చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి



ఉప్పునుంతల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సాధారణ పంటల కంటే సబ్సిడీపై ప్రోత్సాహంతో ప్రభుత్వం అందిస్తున్న ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అచ్చంపేట డివిజన్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలలో పండ్ల తోటలు ఉన్నాయి ?

9,684 ఎకరాలలో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.

ఇక్కడి నేలలు ఏ పండ్ల తోటలకు అనువుగా ఉంటాయి ?

ఇక్కడి ఎర్ర నేలలు అన్ని పండ్ల తోటలకు అనుకూలంగా ఉన్నాయి.

నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ తోటలు ఎంత మంది రైతులు, ఎన్ని ఎకరాలలో సాగు చేస్తున్నారు?

1,760 ఎకరాలలో 456 మంది రైతులు సాగు చేస్తున్నారు.

అయిల్ పామ్ పంటలకు మార్కెట్ సౌకర్యం ఎక్కడ ఉంది?

ప్రీ యూనిక్ కంపెనీ కొనుగోలు చేస్తుంది. రైతు నుంచి నేరుగా అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్నారు. మన దగ్గర ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మాణంలో ఉంది. కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతుంది.

పండ్ల తోటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా ?

నీటి వసతి ఉన్న రైతులను నేరుగా కలిసి ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ పంటలపై అవగాహన కల్పిస్తున్నాం

తోటల పెంపకానికి ప్రభుత్వం ఎంత సబ్సిడీ ఇస్తుంది ?

ప్రస్తుతం మామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ తోటలకు 40 శాతం రాయితీ ఇస్తున్నాం.

న్యూస్ బాక్స్

వర్షంతో రైతులకు ఊరట



మన్ననూరులో కురుస్తున్న వర్షం

మన్ననూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లమల పరిసర గ్రామాలైన మన్ననూరు, వెంకటేశ్వర్లబావి, మాచారం, ప్రశాంత్‌నగర్, అప్పాపూర్, మల్లాపూర్ పెంట తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 15 రోజులుగా వర్షం కురవకపోవడంతో పత్తి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు పంటచేలు ఎండిపోతాయేమోననే దిగులు చెందుతూ ఉన్నారు. శుక్రవారం ఉదయం మోస్తరుగా, శనివారం సాయంత్రం భారీగా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మోస్తరు వర్షం

తాడూరు : మండలంలోని పాపగల్, సిర్సవాడ, ఐతోల్, గోవిందాయపల్లి, భలాన్‌పల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. మందులు పిచికారి చేస్తున్నారు.

'సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

బిజినేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న 3వ జిల్లా మహాసభలకు అధిక సంఖ్య కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్ బాబు కోరారు. మండలంలోని లట్టుపల్లిలో శనివారం మహాసభల కరపత్రాని విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి మధుగౌడ్, సీపీఐ నాయకులు శ్రీను, నాగన్న, ఉషన్న, చంద్రయ్య, రాములు ఉన్నారు.

రేపు 'రేపటి కాలం' కవిత్వం పుస్తకావిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, కవి సంగమం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాదులోని రవీంద్రభారతిలో జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఎదిరెపల్లి కాశన్న రచించిన 'రేపటి కాలం' కవిత్వం పుస్కకావిష్కరణ చేయనున్నట్లు నెలపొడుపు సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కవి సంగమం వ్యవస్థాపకులు డాక్టర్ యాకూబ్ సభాధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరై పుస్తకావిష్కరణ చేయనున్నారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కటుకోజ్వల ఆనందాచారి, ప్రముఖ విమర్శకులు సామిడి జగన్‌రెడ్డి, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

నేడు కాలగమనం పుస్తకావిష్కరణ

ఉప్పునుంతల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ఎంఏ గఫార్ రచించిన కాలగమనం సంపుటిని ఆదివారం అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవిష్కరిస్తారు. ఈ మేరకు కవి ఎంఏ గఫార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పాలమూర్ కవుల చేత కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధులకు పలకరింపు

- వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయాధికారి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ఉపరిషద్వాని

కొల్లాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో విశ్వశాంతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ దమ్ము ఉపనిషద్వాని శనివారం సందర్శించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న న్యాయసలహా కేంద్రాన్ని న్యాయవాదులతో కలిసి ఆమె సందర్శించి వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోర్టు సిబ్బంది, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కోడేరు : మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో శనివారం రైతువేదిక ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి స్థిరాస్థి రూ.100పై బడినవి కొనుగోలు చేస్తే తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని అన్నారు. ఈ సదస్సుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, లోక్‌అదాలత్ సభ్యులు కె.మోహన్‌లాల్, న్యాయవాది వి.మహేందర్‌రావు హాజరై రెవెన్యూ చట్టాలు, కుటుంబ చట్టాలు, సైబర్ నేరాలు, మోటార్ వెహికల్ చట్టాలు ఇన్సూరెన్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కోడేరు ఎస్ఐ జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ కుమార్‌గౌడ్ హాజరయ్యారు.

ఇంటి నిర్మాణం వెంటనే ప్రారంభించాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఎల్లారెడ్డి



అప్పాజీపల్లిలో ఇంటి పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ పనులను వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఎల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పాజీపల్లిలో ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ నిర్వహించి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభింపజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రమౌళిగౌడ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, అప్పల మల్లేష్, పంచాయతీ కార్యదర్శి సంధ్య పాల్గొన్నారు.

మేస్త్రీలు సహకరించాలి

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మించుకున్న ఇంటి పనులకు మేస్త్రీలు సహకరించాలని, అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయవద్దని రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెవ్వ మాధవులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో లబ్ధిదారుల నుంచి ఇష్టారాజ్యంగా మేస్త్రీలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటూ రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, మల్లయ్యగౌడ్, భాస్కర్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

ఊర్కొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. శనివారం మండలంలోని రేవల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు వన మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. వెంట టీఏ రోజా, పంచాయతీ కార్యదర్శి సరేష్ కుమార్ ఉన్నారు.

వేధింపులు ఉన్న చోట షీటీం

- భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ వీణ

కందనూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు ఉన్న చోట షీటీం ఎల్లప్పుడు ఉంటుందని భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ వీణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో శనివారం షీటీం, పోక్సో చట్టం గురించి భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ వీణ అవగాహన కల్పించారు. ఈమధ్య కాలంలో ఇంటి దగ్గర ఉంటున్న ఒంటరి ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఇన్‌స్టాలో పరిచయాలు ఆకర్షణకు గురై మోసపోతున్నారన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థినీలు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్ఐ వీణ అన్నారు. బాధితులు 100 లేదా 8712657676 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని సూచించారు. భరోసా కేంద్రం సేవలు, పోక్సో చట్టం గురించి కో ఆర్డినేటర్ శ్రీలత వివరించారు. కార్యక్రమంలో షీటీం మెంబరు వెంకటయ్య, హ్యూమన్ ట్రాఫికింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు శర్మ, గోపాల్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

తిమ్మాజిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని శనివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సురేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాండాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, సుందరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు

అచ్చంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని ఉమామహేశ్వర క్షేత్రం కొండదిగువన ఉన్న భోగ మహేశ్వరంలోని శ్రీ అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరైనట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. హనుమాన్ భక్తుల కోరిక మేరకు నిధుల మంజూరీకి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులకు ఆర్థిక సహాయం

తాడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన పదవ తరగతి విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం, మెడల్, ప్రశంసా పత్రాలను శనివారం ఎంపీడీవో అంజనేయులు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకుని సమాజానికి మంచి సేవకులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, క్లాస్ మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు రాఘవేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు పోలో శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారు రాజయ్య, జిల్లా అధ్యక్షులు కేపీ.ప్రసాద్, పాఠశాల జీహెచ్ఎం రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో తాగునీటి ఎద్దడి

మన్ననూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండల పరిధిలోని ప్రశాంత్ నగర్ గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. గ్రామానికి రక్షిత నీటిని సరఫరా చేసే బోరుమోటారు మొరాయించడంతో నీటి కొరత ఏర్పడింది.

రేపు వికలాంగుల సన్నాహక సమావేశం

- వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

కల్వకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :వికలాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో ఈనెల 21న నిర్వహించనున్న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు కే.జంగయ్య కోరారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. వికలాంగులకు పింఛన్ ఆరువేలతో పాటు మిగతా హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికలాంగులకు పింఛన్లు పెంచాలని ప్రభు త్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆగస్టు 13న చలో హైదరాబాద్ పేరుతో 'మహాగర్జన' కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ నాగార్జునమాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి, ఎస్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు విజయ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ కల్వకుర్తి మండల అధ్యక్షుడు శేఖర్‌మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాజిద్‌అలీ, నాయకులు రవి, యాదయ్య, స్వామి, బసవయ్య, పాండు, వెంకటయయ్య, మహేష్, రామస్వామి పాల్గొన్నారు.

అసత్పూరు భూములు పేదలకు పంచాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కొల్లాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అసత్పూర్ భూములు పర్యాటక పార్కుకు కాకుండా సాగు చేస్తున్న పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో శనివారం సీపీఎం పట్టణ శాఖ సమావేశం సీపీఎం నాయకుడు సంజు అధ్యక్షతన నిర్వహించి ఆయన మాట్లాడుతూ నిన్న జరిగిన సీఎం సభతో కొల్లాపూర్‌కు ఒరిగింది ఏమీ లేదు. ఈ కార్యక్రమంలో సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి శివవర్మ, మండల కమిటీ సభ్యులు ఎండీ సలీం, బత్తిని రాజు, నాయకులు వెంకటస్వామి, నాని, శివ, రాజు, బీరయ్య, బాలయ్య, శివ శంకర్, కురుమయ్య, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

సమస్యల ఒడిలో సర్కార్ బడులు

కోడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు సుడిగుండంలో కొనసాగుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ నాయకులు పి.నరసింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో సరిపడా సదుపాయాలు లేక బాత్రూమ్, తాగునీటి సౌకర్యం సరిపడా సిబ్బంది తరగతి గదులు లేక సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. మోడల్ స్కూల్ ఆరు బయట వంట చేయాల్సి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పి.రవి, వెంకటయ్య, శివయ్య, డీవైఎఫ్ఐ నాయకులు, ఎస్ఎఫ్ఐ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

ఉప్పునుంతల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో శనివారం మర్యాద ఫౌండేషన్ ప్రతినిధి మర్యాద కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.70 వేల విలువ చేసే బూట్లు, స్కూల్ బ్యాగులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్యాద ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్, హెచ్ఎం శ్రీనివాసురెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటేష్, చందన ఉన్నారు.

విద్యుత్ బృందాల తనిఖీ

వెల్దండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎవరైనా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏడీఈ శంకరయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు కొ్ట్ర గ్రామాల్లో గృహ, వ్యాపారాలు తదితర వాటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగించడంపై జిల్లా నుంచి ప్రత్యేకంగా ఏడీఈ, ఏఈలు వెంకటేశ్వర్లు, జానకిరాంనాయక్, సాయన్నగౌడ్, మేఘనాథ్, శ్రీరాములు వేర్వేరు బృందాలుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యుత్ సిబ్బంది లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణ, సాంబశివుడు, రవీందర్ నాయక్, యాదగిరి, రాజు, నాగేష్ పాల్గొన్నారు.

ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాసిరకమైన భోజనం అందిస్తున్న నాగనూలు కేజీబీవీ ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పరిధిలోని నాగనూలు కేజీబీవీని సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెనుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి : డీవైఎఫ్ఐ

తెలకపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపూర్ మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్వోకి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు కురుమయ్య, మండల నాయకులు శీను, రాఘవేంద్ర, సుల్తాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

పెద్దకొత్తపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెద్దకొత్తపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పెద్దకొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘం నాయకులు చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, జిల్లా కార్యదర్శి పి.మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు ఎండి.గౌస్‌పాషా, మండల ప్రధాన కార్యదర్శి డి.మల్లయ్య, ఉపాధ్యక్షురాలు కే.సువర్ణ, కోశాధికారి వి.లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షులు ఎస్.అంజనేయులు, సీనియర్ నాయకులు ఏ.మోతిరాం, నందీశ్వరయ్య పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

ఊర్కొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఊర్కొండపేట శివారులోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై సూర్యలత కాటన్ మిల్ వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమంతు, లక్ష్మి వనపర్తి జిల్లా పానగల్ మండలం నిజామాబాద్ గ్రామానికి చెందినవారు. ఊర్కొండ శివారులోని గుట్టలపై వడ్డెర పని చేసుకుంటు జీవనోపాధి పొందుతు కల్వకుర్తి పట్టణంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రాత్రి పనులు ముగుంచుకొని కల్వకుర్తి కి వెళ్తున్న క్రమంలో మార్చాల వైపు నుండి మహబూబ్ భాష్ సూర్యలత కాటన్ మిల్లు కు వస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహ నాలు ఎదురెదురుగా బలంగా ఢీకోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమాజానికి గురువులే మార్గదర్శకులు

- ఎమ్మెల్యే కశిరెడ్డి



చదువు చెప్పిన గురువు సూర్యప్రకాశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై19 (ఆంధ్రజ్యోతి) : గురువులు విద్యార్థులతో పాటు సమాజానికి కూడా మార్గదర్శకులేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువులను సమాజంలోని ప్రతీ ఒక్కరు గౌరవించాలని ఆయన కోరారు. తనకు 9వ తరగతిలో విద్యాబుద్ధులు నేర్పిన గురువు సూ ర్యప్రకాశ్‌ను శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తన చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని, తమ వద్ద చదివిన విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలన్న లక్ష్యంతోనే ఉపాధ్యాయులు పని చేస్తూ ఎంతో మంది ఎదుగుదలకు తోడ్పాటునందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు వెంకట్‌రెడ్డి, ఉన్నారు.

● వెల్దండ : మండలంలోని బుడ్డోనిపల్లి గ్రామానికి చెందిన ఇస్లావాత్ రాజుకు సీఎంఆర్ఎఫ్ పథకంకింద మంజూరైన రూ. 3.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రునాయక్, చంద్యానాయక్ పాల్గొన్నారు.

సీఎం రాకతో సింగిల్‌విండో రుణ మాఫీకి హామీ



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెంట్లవెల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన సభ విజయవంతమైందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు ఉద్యోగం అవకాశం గురించి పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అదే విధంగా పెంట్లవెల్లి సింగిల్ విండో కార్యాలయంలో 499 మంది రైతులు రుణమాఫీ చేస్తానని చెప్పడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అదే విధంగా వాల్మీకి బోయల ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనను పరిశీలిస్తామని వారు పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అన్ని గ్రామాలలో గెలిచే విధంగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు నల్ల పోతుల గోపాల్, కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్, భోగ్యం నరసింహ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

కందనూలు, జూలై19 (ఆంధ్రజ్యోతి) : యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనరసింహలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు అధ్యక్షతన సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ పౌరులకు సంక్షేమ ఫలాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు భృతిగా రూ.4వేలు చెల్లింపుతో పాటు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మారేడు శివశంకర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, సహాయ కార్యదర్శి బాలపీరు, ఆఫీసర్ బేరర్స్ విష్ణు, ప్రసాద్, రాజు, మల్లేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధుగౌడ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెద్దకొత్తపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన చంద్రబండతండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సబ్జాలెవల్ నిర్మించుకున్న ముగ్గురు లబ్ధిదారులకు శనివారం మాజీ సర్పంచ్ రాంలాల్ చెక్కులను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయం విదితమే. చంద్రబండ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నేనావత్ శైలజ, పాత్లావత్ ఉమా, ముడావత్ పెంటమ్మకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేసినందుకు హౌసింగ్ ఏఈ రాజావర్ధన్ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ మహేష్‌గౌడ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు బాలునాయక్, లాలునాయక్, పీరు నాయక్, సంతోష్‌నాయక్, మాదాసి కుర్వ కొల్లాపూర్ తాలుకా నాయకులు ఓరే వెంకటస్వామి, ఓర్సు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఐక్య పోరాటాలు చేయాలి

- ఎస్టీయూటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు



మాట్లాడుతున్న ఎస్టీయూటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు

అచ్చంపేటటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాటాలు చేయాలని ఎస్టీయూటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు, రంగాపూర్, సింగారం, చందాపూర్ తదితర గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉపాధ్యాయ సంఘాలు కలిసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. 5పెండింగ్ డీఏలను, పీఆర్సీ అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు వంటి సమస్యలను పరిష్కరించడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ గౌడ్, భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

తెలకపల్లి జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు జడ్పీహెచ్ కారువంగా పాఠశాలలో గతంలో జడ్పీ.హెచ్.ఎస్ పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేసి శ్రీనివాస్‌మూర్తి కుమారుడు రాజశేఖర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించారు. వారి మిత్రుడు కారువంగ నివాసి. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జగన్ కార్వంగ ఉన్నత పాఠశాలకు వచ్చి గత సంవత్సరంలో పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు జీ. స్వాతి 554మార్కులకు రూ.20000, విజయలక్ష్మి 525 మార్కులకు రూ.15000, సంతోషాచారి 515 మార్కులకు రూ.15000 ఇచ్చారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రమూ తీసుపోవని అన్నారు. పాఠశాల విద్యార్థులకు 30 వేల విలువ చేసే 62 బ్యాగులు అందజేశారు. పాఠశాల జీహెచ్ఎం టీవీ చల్మారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

ఊర్కొండ : పదవ తరగతి 2025 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు క్లాస్ మెట్ క్లబ్ కల్వకుర్తి వారి ఆధ్వర్యంలో మండలంలోని మాధారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా సన్మానించి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శ్రీరాములు మాట్లాడుతూ కల్వకుర్తి క్లాస్ మెట్ క్లబ్ సభ్యులు కృషిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో క్లాస్ మెట్‌క్లబ్ రాష్ట్ర అధ్యక్షడు శ్రీనివాసులు. జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తదితరులు ఉన్నారు.